23032025-MAI-04_Layout 1 3/23/2025 3:54 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

గవినోళ్ల శ్రీనివాస్
89198 96723

కాంగ్రెస్‌తోనే పాలమూరుకు కష్టకాలం

'ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణానదిపై ప్రారంభించిన కల్వకుర్తి, రాజీవ్ భీమా, నెట్టెంపాడు.. అదే విధంగా అనుమతులు మంజూరు చేసిన పాలమూరు-రంగారెడ్డి, మక్తల్-నారాయణపేట-కొడంగల్ తదితర అన్ని ప్రాజెక్టులను పూర్తిచేయకుండా దక్షిణ తెలంగాణకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసింది.' ఇవీ ఇటీవల అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు. నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు అన్నట్టుగా ఉంది ఆయన వ్యవహారం. అంతకన్నా దుర్మార్గం ఏమీ లేదు. దక్షిణ తెలంగాణను ఎండబెట్టిందెవరు? పడావు పెట్టిందెవరు? వలసల జిల్లాగా మార్చిందెవరు? గంజి కేంద్రాలను నడిపిందెవరు?తాగునీరు కూడా అందించకుండా ప్రాణాలను పొట్టన పెట్టుకున్నదెవరు? అన్న ప్రశ్నలకు పాలమూరు బిడ్డలను ఎవరినడిగినా సమాధానం చెప్తారు.

ఇది కండ్లముందున్న చరిత్ర. నిన్నామొన్నటి వరకు పాలమూరు సహా దక్షిణ తెలంగాణ యావత్ అనుభవించిన తీరని వ్యథ. కాంగ్రెస్ పాలనలో చెరిపివేయలేని కన్నీటి గోస. హస్తం పార్టీ విషకౌగిలిలో పాలమూరు ఎంతగా నలిగిపోయిందో మాటల్లో చెప్పలేం. సూటిగా చెప్పాలంటే దక్షిణ తెలంగాణకు అన్యాయం చేసిందే కాదు, ఇప్పుడు చేస్తున్నది కూడా కాంగ్రెస్ పార్టీనే. విలీనంతో మొదలైన పాలమూరు విధ్వంసం మళ్లా ఇప్పుడూ కొనసాగుతున్నది. నోటికాడి బుక్కను ఎత్తగొడుతున్నది.

కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కకుండా పోవడానికి ముమ్మాటికీ కేంద్రంలోని కాంగ్రెస్, బీజేపీ పాలకులు, ఉమ్మడి రాష్ట్రంలోని ఏలికలే కారణం. రాష్ట్ర విలీనంతో నికరంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దాదాపు 170 టీఎంసీలను కోల్పోయింది. పాలమూరును పచ్చగా మార్చేందుకు అప్పర్ కృష్ణా, భీమా, తుంగభద్ర ప్రాజెక్టుల ద్వారా నైజాం చేసిన ప్రణాళికలన్నీ చెత్తబుట్టల పాలయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో దశాబ్దాల పాటు ఏలిన కాంగ్రెస్ నేతలు ఏనాడూ పాలమూరు నీటిహక్కులను పట్టించుకున్నది లేదు. ట్రిబ్యునళ్ల ముందు డిమాండ్లను పెట్టింది లేదు. ఉమ్మడి ప్రభుత్వాలు సీమ ప్రాజెక్టులను ఉరికించి పూర్తిచేసి, పాలమూరు ప్రాజెక్టులను పండవెట్టి కండ్ల ముందే నీళ్లను తరలించుకుపోయాయి. ఏకపక్షంగా అన్యాయం జరుగుతున్నా పాలమూరే కాదు, తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ నేతలు ఎవరూ, ఏనాడూ నోరుమెదిపింది లేదు. పదవుల కోసం, గుత్తేదారు పనుల కోసం పెదవులు మూసుకున్నారే తప్ప అన్యాయాన్ని ప్రశ్నించిన దాఖలాల్లేవు. రాష్ట్ర విభజన సమయంలోనైనా తెలంగాణకు చేసిన ద్రోహాన్ని సరిదిద్దాలని చూడలేదు. ఇదిలా ఉంటే మరింత అన్యాయానికి గురిచేసింది మళ్లీ ఈ కాంగ్రెస్ పార్టీనే. నదీ పరీవాహక ప్రాంతం ఆధారంగా కృష్ణా జలాల పునఃపంపిణీ చేయకుండా అప్పటికే ఉన్న ప్రాజెక్టులవారీగా పంచాలని తెలంగాణ హక్కులను కాలరాసింది. పునర్విభజన చట్టంలో సెక్షన్ 89 పేరిట పాలమూరు గొంతు మరోసారి కోసింది. కాంగ్రెస్ పాపం ఫలితంగానే స్వరాష్ట్రంలోనూ పదేండ్లుగా తెలంగాణ జలదోపిడీకి గురవుతున్నది. నీళ్ల కోసం పోరాడాల్సి వచ్చింది. రాష్ట్ర విభజన సమయానికి అప్పటికే తెలంగాణ, ఏపీలో నిర్మాణం పూర్తయిన, ప్రారంభించిన ప్రాజెక్టుల నీటి వినియోగ సామర్థ్యాలను లెక్కలోకి తీసుకొని, ఆ ప్రకారం ఏపీకి 512, తెలంగాణకి 299 టీఎంసీలు తేల్చడం వల్లే నేడు ఈ దుస్థితి. ఇది నిన్నా మొన్నటి చరిత్రనే. కండ్లముందు జరిగిందే.

ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరుకు నాటి కాంగ్రెస్ పాలకులు చేసిన విద్రోహానికి జూరాల, భీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు ప్రాజెక్టులే సజీవ సాక్ష్యాలు. జూరాల ప్రాజెక్టుకు ట్రిబ్యునల్ 17.84 టీఎంసీలను కేటాయించింది. కర్ణాటక రాష్ట్రంలోని ముంపు బాధితులకు పరిహారం చెల్లించకపోవడంతో రాష్ట్ర ఏర్పాటు వరకూ ఏనాడూ ఎఫ్ఆర్ఎల్ నింపలేదు.

ఇక ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వచ్చే సమయానికే దాని గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలకు పడిపోయింది. అందులో ప్రస్తుతం లైవ్ కెపాసిటీ 6.8 టీఎంసీలు మ్రాతమే. కాంగ్రెస్, నాటి టీడీపీలు చేసిన కుట్ర ఫలితంగానే పాలమూరు గడ్డపై నిలవకుండా ఎగువ నుంచి వచ్చిన వరద వచ్చినట్టుగా దిగువకు పరుగులు పెడుతూనే ఉన్నది. ఇదిలా ఉంటే ఈ వాస్తవాలు తెలిసికూడా, ఉన్న ఆయకట్టుకు నీరిచ్చే పరిస్థితి ఉండబోదని నెత్తీనోరు కొట్టుకుని మొత్తుకున్నా ఉమ్మడి రాష్ట్ర పాలకులు వినలేదు. కుట్రపూరితంగా, కృష్ణాజలాలు తెలంగాణకు దక్కకుండా చేసేందుకు మూలిగే నక్కపై తాటికాయ పడ్డచందంగా జూరాల ప్రాజెక్టును ఆధారంగా చేసుకునే అనేక ఎత్తిపోతల పథకాలను ప్రతిపాదించారు. రాజీవ్ భీమా స్టేజ్-1, స్టేజ్-2, కోయిల్‌సాగర్, జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాలను జూరాల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నుంచే చేపట్టారు. వెరసి ఇప్పుడు 9.66 టీఎంసీ సామర్థ్యం ఉన్న జూరాలపై ఆధారపడి ప్రస్తుతం 5.48 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ ఆయకట్టుకే వానకాలంలో నీరందించలేని దుస్థితి. ఇదీ కాంగ్రెస్ ఏలికల నిర్వాకం. ఇప్పుడైనా ఆ తప్పును సవరించుకునే ప్రయత్నం రేవంత్‌రెడ్డి సర్కారు చేస్తున్నదా అంటే మరింత అన్యాయానికి గురిచేస్తున్నది. భీమా నికర జలాల్లోనే కోత విధించి కొడంగల్-నారాయణపేట్‌ను చేపట్టి మరో లక్ష ఎకరాల ఆయకట్టు భారాన్ని జూరాలపై మోపింది. ప్రాజెక్టు ఉసురుతీయ పూనుకున్నది. సరే భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి పనులనైనా పూర్తిచేసిందా అంటే లేదు. మట్టి పనులు చేసి నిధులు కొల్లగొట్టారు తప్ప నీళ్లి వ్వాలనే ఆలోచనే లేకుండాపోయింది.

ప్రాజెక్టులకు జీవోలు ఇవ్వడం, చేతులు దులుపుకోవడం. అక్కడికే పరిమితం. నిధులివ్వకుండా, భూ సేకరణ చేపట్టకుండా, అటవీ అనుమతులు, రైల్వే, రోడ్ క్రాసింగ్, అంతర్రాష్ట్ర వివాదాలు, కాంట్రాక్టు సంస్థలతో వివాదాలు, కోర్టు కేసులు తదితర సాకులు చూపెడుతూ తెలంగాణ ప్రాజెక్టులను మూలకు నెట్టారు. ఏపీ ప్రాజెక్టులను పరుగులు పెట్టించి ద్రోహం చేసిందే కాంగ్రెస్. ఇప్పుడు పూర్తిస్థాయిలో తాత్కాలిక వాటా జలాలనైనా తెలంగాణ వినియోగించుకోలేకపోవడానికి, దాచుకోలేకపోవడానికి, మొత్తంగా నిస్సహాయతకు కాంగ్రెస్ పార్టీనే కారణం. ఏపీ యథేచ్ఛగా జలాలను మళ్లించుకొని, దాచుకునేందుకు ఊతమిచ్చిందే కాంగ్రెస్ పాలకులు. ఇది ముమ్మాటికీ సత్యం.

ఇక పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ కథ పెద్దది. దీని పాపమూ కాంగ్రెస్, టీడీపీలదే. బచావత్ ట్రిబ్యునల్ అవార్డ్‌తో ఆంధ్రా నేతల ఆశలకు గండిపడింది. కోస్తా ఆంధ్ర ప్రాంత ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ పాలకులు 1973 నుంచే కొత్త పన్నాగాలకు తెరతీశారు. తమిళనాడుకు తాగునీటి సరఫరాను ఆసరాగా చేసుకొని శ్రీశైలం ప్రాజెక్టుకు గండి కొట్టింది కాంగ్రెస్ పార్టీనే. శ్రీశైలం డ్యాం నుంచి లైనింగ్ చేసిన, 1500 క్యూ సెక్కుల సామర్థ్యానికి మించని కెనాల్ ద్వారా పెన్నా వరకు, అక్కడి నుంచి మద్రాస్‌కు 15 టీఎంసీలను తరలిస్తామని చెప్తూ 874 ఎత్తు వద్ద పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ఏర్పాటుకు ఒప్పందాలు జరిగాయి. కానీ,

1983లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక బేసిన్‌లోని రాష్ట్రాల ఒప్పందాన్ని వక్రీకరించి తమిళనాడుతో ద్వైపాక్షిక ఒప్పందం చేసుకుని తెలుగు గంగ పథకాన్ని తెరమీదికి తీసుకువచ్చారు. 3,500 క్యూసెక్కుల చొప్పున మూడు గేట్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా దురాలోచన చేసి 5,200 క్యూసెక్కుల సామర్థ్యంతో ఏర్పాటుచేశారు.

ఏ ప్రాజెక్టు వద్ద లేనివిధంగా స్టాండ్ బై పేరిట మూడింటిని అదనంగా మరో గేట్‌ను అదే సామర్థ్యంతో నిర్మించారు. కాగితాల్లో 11,150 క్యూసెక్కులుగా ఉంటే, ఆచరణలో భవిష్యత్తులో విస్తరించుకునేందుకు వీలుగా రెండింతలు 20,560 సామర్థ్యంతో గేట్లను ముందుగానే ఏర్పాటుచేశారు. అంతేనా సిమెంట్ లైనింగ్ లేకుండానే ఒప్పందాలకు విరుద్ధంగా రెండు మూడింతల ఎక్కువ సామర్థ్యంతో కాలువలను తవ్వారు. హెడ్ రెగ్యులేటరీ కాలువనే 11,150 క్యూసెక్కులు ఉంటే, దాని నుంచి నీటిని విడుదల చేసే గేట్ల సామర్థ్యం అంతమేరకే ఉండాలి. కానీ, అందుకు భిన్నంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ దిగువన బనకచర్ల రెగ్యులేటరీ వద్ద ఒక్కో గేట్‌ను 11,150 సామర్థ్యంతో మూడు గేట్లను ఏర్పాటుచేసి, మొత్తంగా 33,450 క్యూసెక్కుల నీళ్లను తరలించేలా ప్రణాళికలను దశాబ్దాల ముందుగానే రూపొందించుకున్నారు. ఆ పనులన్నీ 1987-88 కాలంలో పూర్తికాగా, నాటినుంచి బేసిన్ ఆవల ఉన్న ప్రాంతాలకు కృష్ణా జలాల అక్రమ మళ్లింపునకు తొలి బీజం పడింది. మళ్లా 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన వైఎస్ఆర్ తెలంగాణకు అంతకు మించి తీరని ద్రోహాన్ని తలపెట్టారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కులకు పెంచారు. సరే అక్కడితో ఏమైనా ఊరుకున్నారా అంటే అదీ లేదు. మళ్లీ అందులోనూ మరో అక్రమానికి తెగబడ్డారు. భవిష్యత్తులోనూ తిరిగి హెడ్ రెగ్యులేటరీ కెపాసిటీని 88 వేల క్యూసెక్కులకు పెంచుకునేందుకు అనువుగా కెనాల్ బెడ్ లెవల్ 32 మీటర్ల నుంచి ఏకంగా 78 మీటర్లకు పెంచడంతో పాటు, లైనింగ్ లేని కెనాల్‌ను ప్రతిపాదించి అప్పుడే వైఎస్ పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పరోక్షంగా 70 వేలకు పెంచారు. పోతిరెడ్డిపాడు వద్ద అప్పటికే ఉన్న నాలుగు గేట్లను తొలగిస్తామని చెప్పినా నేటికీ ఆ పనిచేయలేదు. అదనంగా 10 గేట్లను నిర్మించారు. ఇదీ పాలమూరుకు కాంగ్రెస్ చేసిన విద్రోహానికి తార్కాణం. దాని కొనసాగింపులో భాగంగానే ముఖ్యమంత్రి అయ్యాక జగన్ రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టారు. కృష్ణా జలాల సాధనకు ఉద్యమనేతగా కేసీఆర్ చేసిన పోరాటాన్నే స్ఫూర్తిగా తీసుకొని ఎన్టీటీ వరకు వెళ్లి, ప్రాజెక్టును సవాల్ చేసి అడ్డుకున్నది నేను. ఆ గతికి తీసుకొచ్చిందే కాంగ్రెస్. వీటిపై కాంగ్రెస్ నేతలు ఏనాడూ మాట్లాడలేదు. మళ్లీ వారే ఇప్పుడు పాలమూరు అన్యాయంపై మొసలి కన్నీరు కార్చడం సిగ్గు చేటు. కృష్ణా జలాల్లో హక్కులను కాలరాసి.. ప్రాజెక్టులను పండబెట్టి.. పెండింగ్ ప్రాజెక్టులుగా పేరు పెట్టి.. పాలమూరును నిలువునా ముంచి.. వలస బాట పట్టించిన హస్తం పార్టీనే నేడు సుద్దులు చెప్తున్నది.

కృష్ణాలో పాలమూరు జిల్లాకు కొంతైనా న్యాయం జరిగిందంటే, సాంత్వన చేకూరిందంటే అది ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి ఫలితమే. పోతిరెడ్డిపాడు విస్తరణతో వాటిల్లబోయే నష్టాన్ని గ్రహించి పదవులకు రాజీనామా చేసి నాడు గర్జించారు. పాలమూరు గొంతుకను వినిపించారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి పాలకులు చూపుతున్న వివక్షను ప్రశ్నించారు.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక కృష్ణా జలాల సాధనకు చేసిన కృషి అద్వితీయం. కర్ణాటక రాష్ట్రంలోని ముంపు బాధితులకు పరిహారం చెల్లించారు. జూరాల ప్రాజెక్టును పూర్తిస్థాయి మేరకు నీటి నిల్వ చేసుకునేలా చేశారు. పెండింగ్ ప్రాజెక్టులుగా పేరొందిన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తిచేసి రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారు. చెరువులతో అనుసంధానించి, చెక్‌డ్యామ్‌లను నిర్మించి, కృష్ణమ్మను ఒడిసిపట్టి.. మెట్ట భూములకు కృష్ణమ్మను తరలించిన ఘనత కేసీఆర్‌దే.

అంతేకాదు, పునర్విభజన చట్టంలోని సెక్షన్-89 వల్ల తెలంగాణకు, పాలమూరుకు ఎలాంటి ప్రయోజనం ఒనగూడబోదని, అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం-1956 సెక్షన్ 3 ప్రకారమే న్యాయమే జరుగుతుందని గుర్తించింది కేసీఆరే. కోర్టులకు వెళ్లి, పట్టు బట్టి, కేంద్రాన్ని ఒప్పించి చివరికి సెక్షన్ 3 ప్రకారం ట్రిబ్యునల్‌ను సాధించింది ఆ ఉద్యమ నాయకుడే. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను పట్టాలెక్కించారు. జూరాలపై భారం లేకుండా, ఏడాది పొడవునా కృష్ణా జలాలను అందుబాటులో ఉండేలా శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ప్రాజెక్టును రీ డిజైన్ చేశారు. పాలమూరు గడ్డపై కృష్ణమ్మను నిలిపేందుకు భారీ రిజర్వాయర్ల నిర్మాణం పూర్తిచేశారు. ప్రధాన హెడ్ వర్క్స్ పనులన్నీ పూర్తికాగా, కొద్దిపాటి డిస్ట్రిబ్యూటరీ పనులే మిగిలి ఉన్నాయి. వాటిని కూడా పూర్తి చేయకుండా ఇప్పుడు పాలమూరును ఎండబెడుతున్నది కూడా మళ్లా కాంగ్రెస్సే. ■

'పాలమూరుకు ఎవరు ఏం చేశారు? నీటి హక్కుల కోసం పోరాడిందెవరు? సాధించిందెవరు? నీరుగార్చిందెవరు? కృష్ణాలో ముంచిందెవరు?' అనేది అందరికీ తెలుసు. ఇకనైనా కాంగ్రెస్ ఏలికలు మాటలు ఆపి చేతల్లో పాలమూరుపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. లేదంటే మళ్లీ ఉద్యమించక తప్పదు. ఇది తథ్యం.

షేక్ ఫరేజ్ మొహియుద్దీన్
96661 74738

కేసీఆర్ బాటలోనే దక్షిణాది నేతల పోరు

ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడే ప్రాంతీయ అస్తిత్వ పతాకలు ఎగురుతాయి. మన కలలు సాకారమవుతాయి. మన గళం ఢిల్లీకి వినబడుతుంది. రాష్ట్రాల హక్కులు రక్షింపబడుతాయి. సమాఖ్యవాదం కలకాలం వర్ధిల్లుతుంది. ఈ విషయాన్ని ఎప్పుడో గుర్తించిన కేసీఆర్... ప్రాంతీయ పార్టీల ఐక్యత కోసం దేశమంతా కలియతిరిగారు. స్టాలిన్, మమతా బెనర్జీ, హేమంత్ సోరేన్, అరవింద్ కేజ్రీవాల్, అఖిలేష్ యాదవ్ తదితర నేతలను కలిశారు. ప్రాంతీయ పార్టీల ఐక్యత కోసం కృషిచేశారు. అందులో భాగంగానే టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చారు. మన ఐక్యత దెబ్బతిన్న నాడు మన కల చెదిరిపోతుందని కేసీఆర్ చెప్పినట్టుగానే.. నేడు తెలంగాణ అస్తిత్వ పతాక బీఆర్ఎస్ అధికారంలో లేని సమయంలో బీజేపీ డీ లిమిటేషన్ పేరిట తెలంగాణపై కత్తిగట్టింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్-82, ఆర్టికల్-170 ప్రకారం ప్రతి పదేండ్ల కోసారి జనగణన జరగాలి. ఆ జనాభా లెక్కల ఆధారంగా డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952 నుంచి 1973 వరకు ఈ ప్రక్రియ సజావుగా సాగింది. ఆ తర్వాతే అసలు సమస్య ఉత్పన్నమైంది. అప్పటి వరకు దేశంలోని అన్ని ప్రాంతాల్లో జనాభా పెరుగుదల ఇంచుమించు ఒకే విధంగా ఉన్నది. దేశానికి సమస్యగా మారుతున్న జనాభా పెరుగుదలను అరికట్టాలని నిశ్చయించుకున్న అప్పటి కేంద్ర ప్రభుత్వం... 42వ రాజ్యాంగ సవరణ చేసి 2001 వరకు డీ లిమిటేషన్ ప్రక్రియ చేపట్టకూడదని నిర్ణయించింది. జాతీయ శ్రేయస్సు దృష్ట్యా దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా పాటించగా... ఉత్తరాది రాష్ట్రాలు ఈ అంశాన్ని పట్టించుకోలేదు.

ఈ కారణంగానే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగకూడదనే ఉద్దేశంతో 2002లో 84వ రాజ్యాంగ సవరణ ద్వారా 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియ నిలుపుదల చేస్తూ నిర్ణయించారు. కానీ, ఇప్పటికీ జనాభా పెరుగుదలలో అసమతుల్యత సమస్య వెంటాడుతూనే ఉన్నది. ప్రస్తుతం తెలంగాణ సహా మిగతా దక్షిణాది రాష్ట్రాల సంతానోత్పత్తి రేటు ఇంచుమించు 1.7 కాగా.. యూపీ 2.7, బీహార్ 3గా ఉన్నది. 1951 జనాభా లెక్కల ప్రకారం... దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాల వాటా 26.2 శాతం కాగా.. నేడు 18 శాతానికి పడిపోయింది. పార్లమెంట్‌లో 20 శాతం ప్రాతినిధ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీలో సుమారుగా 35 శాతం వరకు సమకూర్చుతున్నాయి. అయినా దక్షిణాదికి ఇటు నిధుల పరంగా, పార్లమెంట్‌లో సీట్ల పరంగా అన్యాయం తలపెట్టడం దారుణం.

ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం.. డీ లిమిటేషన్ ప్రక్రియ చేపడితే దేశంలో పార్లమెంట్ సీట్ల సంఖ్య 848కి చేరుతుంది. దీని ప్రకారం చూసుకుంటే.. యూపీలో ప్రస్తుత 80 సీట్లు 143కి, బీహార్‌లోని 40 సీట్లు 79కి, మహారాష్ట్రలోని 48 సీట్లు 73కి, గుజరాత్ లోని 26 సీట్లు 53కి, రాజస్థాన్‌లోని 25 సీట్లు 50కి, మధ్యప్రదేశ్‌లోని 29 సీట్లు 47కు చేరుతాయి. ఈ లెక్కన ఒక్క యూపీలోనే 63 సీట్లు పెరుగనున్నాయి. బీహార్‌లో దాదాపుగా రెండింతలు 39 సీట్లు పెరుగనున్నాయి. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిపి 35 సీట్లు మాత్రమే పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న 129 సీట్లు 165కి పెరుగుతుండగా.. యూపీ, బీహార్ రాష్ట్రాల్లోనే 120 సీట్లు 222కి పెరుగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో సీట్ల పెరుగుదల శాతం 85 కాగా.. దక్షిణాదిలో 28 శాతం సీట్లు పెరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లో చూసుకున్నా సీట్ల పెరుగుదల శాతం దక్షిణాది కంటే ఎక్కువగా 57 శాతంగా ఉన్నది.

వాస్తవానికి దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలోనూ ప్రస్తుతం బీజేపీ అధికారంలో లేదు. ఏపీలో మాత్రమే మైనర్ పార్ట్‌నర్‌గా ఉన్నది. భవిష్యత్తులోనూ దక్షిణాదిలో బీజేపీ ఏ రాష్ట్రంలోనూ గెలిచే అవకాశాలు కనిపించడం లేదు. అందుకే, తనకు పట్టున్న హిందీ రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను గణనీయంగా పెంచుకోవాలని కాషాయ పార్టీ కుటిలయత్నం చేస్తున్నది.

అదే జరిగితే యూపీ, బీహార్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ లాంటి హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో పాగా వేసి శాశ్వతంగా అధికారంలో ఉండిపోవాలని కుట్రలు పన్నుతున్నది. దక్షిణాదికి మాత్రమే కాదు, పశ్చిమబెంగాల్, ఒడిశా, పంజాబ్ లాంటి ప్రాంతీయ అస్తిత్వాలకు ప్రతీకలైన రాష్ట్రాల్లోనూ డీ లిమిటేషన్ వల్ల తీవ్ర నష్టం జరుగనున్నది.

ఇప్పటికే నిధుల విషయంలో అన్యాయం జరుగుతుండగా, రాబో యే రోజుల్లో దేశ నాయకత్వాన్ని ఎన్నుకునే క్రమంలో దక్షిణాది ఓటు చెల్లుబాటు కాకుండా పోతుంది. పార్లమెంట్‌లో దక్షిణాది మాట పలుచనయ్యే ప్రమాదం ఉన్న ది. దక్షిణాది ప్రజలను సెకండ్ క్లాస్ సిటిజెన్స్‌గా చూస్తూ, వివక్ష చూపే అవకాశం లేకపోలేదు. ఈ ప్రమాదాన్ని అరికట్టేందుకు కేసీఆర్ చూపిన బాటలో దక్షిణాది నేతలు అడుగులు వేస్తున్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్ దీనిపై పోరు మొదలుపెట్టగా.. చంద్రబాబు మోదీకి ఎదురు తిరగలేక జనాభాను పెంచాలని పిలుపునిస్తున్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు చెన్నైలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్ తరపున పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తదితర నేతలు తెలంగాణ గళం వినిపించారు. డీలిమిటేషన్ వల్ల తెలంగాణ సహా దక్షిణాదికి జరగనున్న అన్యాయంపై చర్చించారు. మెజారిటీ ప్రాంతం వల్ల మైనారిటీ ప్రాంతానికి జరిగే వివక్ష తెలంగాణకు స్వానుభవమేనని, సీమాంధ్రకు వ్యతిరేకంగా కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని స్థాపించి, 14 ఏండ్ల పాటు పోరు సలిపి విజయం సాధించారని కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల హక్కుల కోసం జరిగే పోరులో కూడా బీఆర్ఎస్ ముందు వరుసలో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రానున్నరోజుల్లో ఈ మహోద్యమానికి తెలంగాణ కేంద్ర బిందువుగా మారడం ఖాయం.

(వ్యాసకర్త: బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

కూడవెల్లి జలకళకు నాలుగేండ్లు

దుబ్బాక నియోజకవర్గంలో ప్రధాన సాగునీటి వనరు కూడవెల్లి వాగు. దీనిపక్కనే మా పొలం ఉండేది. వానలు కురిసి, వాగులోకి నీళ్లు వస్తేసే మా భూమి సాగయ్యేది. ఒక్కసారి వాగు నిండితే ఆ పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి రైతులకు మేలు జరిగేది. ఒకవేళ వానలు కురవకుంటే భూములు బీళ్లుగానే ఉండేవి. వాగు ఎండిపోతే పశుపక్ష్యాదులకు సైతం తాగునీరు లేని దుర్భర పరిస్థితులను చూశాం. ఈ క్రమంలో 2021లో యాసంగిలో కూడవెల్లి వాగులో నీళ్లు అడుగంటిపోవడంతో పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఎదురైంది.

ఉద్యమ కాలంలో తెలంగాణ వస్తేనే మన నీళ్లు మనకు, మన నిధులు మనకు, మన ఉద్యోగాలు మనకు వస్తాయని చెప్పిన కేసీఆర్, ఆ తర్వాత అధికారంలోకి వస్తే గోదావరి జలాలతో ప్రజల కాళ్లు కడుగుతానని మాటిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు నాలుగేండ్లలో తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ అయిన కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసి మల్లన్నసాగర్‌లో గోదావరి జలాలను పారించారు. 2021 మార్చి 20న కూడవెల్లి వాగులో నీళ్లు గుంజుకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని, గోదావరి నీళ్లు విడిచి పంటలకు ప్రాణం పోయాలని తొగుట మండల టీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. మరునాడు గజ్వేల్ రైతులు మంత్రి తన్నీరు హరీశ్‌రావు దృష్టికి తీసుకుపోవడం, ఆయన వెంటనే స్పందించి సీఎం కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. 'హరీశ్ గో అహెడ్, కొడకండ్ల దగ్గర, జగదేవ్‌పూర్ దగ్గర కొండపోచమ్మ కాలువకు గండి పెట్టి కూడవెల్లికి నీటిని విడుదల చేయాలని' కేసీఆర్ ఆదేశించారు. అప్పటికప్పుడు కొడకండ్ల వద్ద కొండపోచమ్మ కాలువను బ్రేక్ చేసే పనులు ప్రారంభించి మార్చి 23న కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేశారు. మండుటెండల్లో కూడవెల్లి వాగు వానకాలం లెక్క.. గలగలా పారుతూ పరవళ్లు తొక్కింది. కేవలం మూడు రోజుల్లోనే ఆ వాగు నిండి నర్మాల చెరువులో పడటంతో ఇక్కడి నేల పులకించిపోయింది. రైతుల మోముల్లో సంతోషం వెల్లివిరిసింది. చెట్టూ చేమ పచ్చగా మారగా, పక్షుల కిలకిలరావాలు వినిపించాయి. నాటి సీఎం కేసీఆర్‌ను మొక్కని రైతు లేడంటే అతిశయోక్తి కాదు.

'గండు కరువులో, నిప్పులు కురిసే మండుటెండల్లో గోదావరి జలాలతో కూడవెల్లి వాగు ప్రాజెక్టులు కడుతాం' అని పదేండ్ల కింద కేసీఆర్ టీవీల్లో చెప్తుంటే.. ' ఆ వాళ్లు ప్రాజెక్టులు కడుతరు, మాకు నీళ్లొస్తయా, నాయకుల ఇలాంటి మాటలు ఏండ్ల తరబడి వింటూనే ఉన్నాం. ఒకవేళ కట్టినా మేము కాదేమో, మా మనమండ్లు చూస్తారేమో' అని స్థానిక ప్రజలు గుసగుసలాడేవారు. ఎక్కడి గోదావరి, ఎక్కడి మల్లన్నసాగర్.. ఇక్కడికి నీళ్లు వస్తయా.. మనం చూస్తమా అనుకున్నాం. ఎండకాలం వస్తే గోదావరిలోనే నీళ్లు తగ్గిపోతాయి. ఇక మాకు నీళ్లెలా వస్తాయనుకున్నాం. కానీ, నేడు కూడవెల్లి వాగులోకి, చెరువులు, కుంటల్లోకి గోదావరి నీళ్లను విడిచిన తర్వాత 'కేసీఆర్‌ను చూసి గర్వపడుతున్నాం' అని కూడవెల్లి వాగు పొంట పొలాలున్న రైతులు సంతోషంగా చెప్పిండ్రు.

2021, మార్చి 23న కాళేశ్వర జలాలు కూడవెల్లికి రావడంతో స్థానిక ప్రజలకు గోదారమ్మను అక్కడే చూసే భాగ్యం కలిగింది. కాళేశ్వరానికి వెళ్లాల్సిన వ్యయ ప్రయాసలు లేకుండా కూడవెల్లి వాగులోనే గోదావరి స్నానం చేసే అవకాశం వచ్చింది. కూడవెల్లి వాగు దక్షిణం నుంచి ఉత్తరానికి ప్రవహించడం